క్లుప్తంగా

శాంతి స్వరూప్ మృతికి సంతాపం

ఖమ్మంవన్‌టౌన్: తెలుగు భాషలో మొదటి టీవీ న్యూస్ రీడర్‌గా పనిచేసిన శాంతి స్వరూప్ మృతి బాధాకరమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దూరదర్శన్ పేరు చెప్పగానే ఆయన పేరు గుర్తుకొచ్చేదన్నారు. ఆయన ఆదర్శప్రాయమైన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ మేరకు వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

కొర్రీలు లేకుండా ధాన్యం కొనాలి..

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రాజేశ్వరపురం మిల్లర్లను కలిసి చర్చించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని, సిండికేటుగా మారి ఇబ్బందులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. మిల్లర్ల తీరు మారకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రచ్చా నరసింహారావు, ఇంటూరి అశోక్, రాజశేఖర్, గంగాధర్, సన్మత రావు, రాసాల కనకయ్య, రమణారెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'గీతాంజలి'కి చత్రాలయ పురస్కార్



చంద్రబోస్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అప్పారావు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న గీతాంజలి విద్యానికేతన్ పాఠశాలకు చత్రాలయ పురస్కార్(ఉత్తమ విద్యా సంస్థ) అవార్డు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్‌లు తెలిపారు. సుచిరిండియా ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యాన గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్‌కు ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ కవి, గాయకుడు చంద్రబోస్, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డిలు అవార్డును అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత 21 ఏళ్లుగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం వల్లే అవార్డు లభించిందన్నారు. అవార్డు లభించడం పట్ల పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

'ఎక్స్‌ఎల్ఆర్'కు 31 మంది ఎంపిక

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఎక్స్‌ఎల్ఆర్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు 31 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మొత్తం 258 మంది విద్యార్థులు పాల్గొనగా.. చివరకు 31 మంది ఎంపికయ్యారని, వీరి వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	18	పాలకూర	2
పచ్చిమిర్చి	30		10
కాకర	40	చుక్కకూర	2
బీర	46		10
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	66		20

-ఖమ్మం వ్యవసాయం

మూఢత్వం.. మూర్ఖత్వం!



ప్రజల్లో పెరుగుతున్న మూఢనమ్మకాలు

- అంధవిశ్వాసాలతో అకృత్యాలు
- ప్రధాన కూడళ్లే లక్ష్యంగా వింత పోకడ
- విద్యావంతుల్లోనూ విపరీత ధోరణులు
- భయపడుతున్న పాదచారులు, కాలనీలవాసులు

ఖమ్మంవన్‌టౌన్: శాస్త్ర సాంకేతిక రంగాలు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న తరుణాన.. మానవుడు రోదసీలోకి సునాయాసంగా వెళ్లి వస్తూ నూతన ఆవిష్కరణలు చేస్తుంటే.. రానురాను ప్రజల్లో మూఢత్వం అదేస్థాయిలో తారాస్థాయికి చేరుతోంది. దీంతో నగరం నలుమూలలా మూడు, నాలుగు దారులు కలిసేచోట మంత్రించిన నిమ్మకాయలు, రక్తపు రంగులో అన్నపుముద్దలు దర్శనమిస్తున్నాయి. విజ్ఞానం తక్కువగా ఉండి నాగరికత అభివృద్ధి చెందని సమాజంలో మూఢనమ్మకాలు క్రమేపీ తగ్గుతూ వస్తుంటే.. పాలకులు అవలంభిస్తున్న కొన్ని చర్యలతో ఇటీవల మూఢనమ్మకాల జాడ్యం మరింతగా పెరుగుతోంది. వీటిని రూపుమాపేందుకు కొన్ని సామాజిక సంస్థలు, పోలీసులు తమ కళాజాతాల ద్వారా ప్రజల్లో కొంత చైతన్యం కలిగిస్తున్నారు. అయినా ప్రజలు మూఢత్వంతోటే బతుకుతూ వింత పోకడలు పోతున్నారు.

గిరిగీసుకుని.. లోబడి...

నగరం ఇంత అభివృద్ధి చెందుతున్నా.. ప్రజలు మాత్రం తిరోగమనంలోకి వెళ్తుండడం ఆశ్చర్యాన్ని కలిగించే అంశం. ఖండాంతరాలు దాటి ప్రపంచంలోని అన్నీ దేశాలు చుట్టివస్తున్నా.. మనిషి మాత్రం తాను గిరిగీసుకున్న చట్రంలో కొన్నింటికే లోబడి బతుకుతున్నాడు. ఎంత చదువు చదివినా ఇలాంటి మూఢనమ్మకాలను బాగా నమ్ముతుండడం గమనార్హం. మారుతున్న సమాజాన్ని చూసైనా వీరిలో మార్పురావాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లే లక్ష్యంగా..

నగరం శివారులోని పలు కాలనీలు, విలీన గ్రామాల నుంచి వచ్చే రోడ్ల కూడళ్లలో మంత్రించిన నిమ్మకాయలు, రక్తపు రంగులో అన్నపు ముద్దలు కలిపి ఇస్తరాకుల్లో పెడుతున్నారు. తెల్లవారే సరికి ఆ ఇస్తారాకులు దర్శనమిస్తుండడంతో అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు ఒక్కసారి ఏదో భావనకు లోనవుతూ భయపడిపోతున్నారు. ఇలా చేయడం వలన తమకు వచ్చిన జబ్బులు, ఆవహించినవి ఏవో పోయి తమకు మంచి జరుగుతుందన్న మూఢనమ్మకం. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు స్వాములు, పూజలు చేసేవారు మంత్రాలు, తంత్రాల పేరుతో అమాయక ప్రజల నుంచి డబ్బులు గుంజుతున్న సందర్భాలు లేకపోలేదు.

ప్రజల్లో మార్పు రావాలి...



మూఢనమ్మకాల జాడ్యంతో కునారిల్లుతున్న ఈ సమాజంలో మార్పు రావాలి. పాలకులు మతం, కులం మత్తులో ప్రజలను ఉంచుతూ ఓట్లు దండుకుంటున్నారే తప్ప ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నారు. తమ సామాజిక అధ్యయన వేదిక ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తాం.

– కాకి భాస్కర్, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక

అవగాహన కల్పిస్తాం..



మూఢనమ్మకాలు, బాణామతి, చేతబడి తదితరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. కొత్తగూడెం, గొల్లగూడెం గ్రామాలతో పాటు నగరంలోని పలు ప్రధాన కూడళ్లలలో పోలీసు కళాజాతాల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు తమ శాఖ ద్వారా కృషి చేస్తున్నాం.

– రదం భానుప్రకాష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఖానాపురం హవేలీ

జిల్లా అభివృద్ధికి మరోమారు గెలిపించండి

బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా


ఓటు అభ్యర్థిస్తున్న నామా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభలో జిల్లా వాణిని వినిపించడంతో పాటు ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేసిన తనను మరోసారి గెలిపించి లోక్‌సభకు పంపించాలని ప్రజలను బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం నగరంలోని కస్పాబజార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలుత ముస్లింలతో కలిసి జామా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశాక రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలోని దుకాణాలకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లాతో పాటు రాష్ట్ర సమస్యలను లోక్‌సభలో ప్రస్తావించేందుకు తనను ఖమ్మం ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు తాజుద్దీన్, ఖమర్, ఫిరోజ్, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడి చేయడం హేయం


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: సత్తుపల్లి పోడు భూముల ఘర్షణ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గిరిజన, గిరిజన మహిళలపై విచక్షణరహితంగా దాడి చేయడం హేయమని, దాడి చేసిన సదరు పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర సమన్వయ కర్త మద్దిశెట్టి అజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములపై జరిగిన గొడవపై నిజనిర్ధారణకు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, పోలీసు స్టేషన్‌లో గిరిజన మహిళలను కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మద్ది శెట్టి సామెల్‌పై రాజకీయ కుట్ర నడుస్తుందని, రాజకీయాధికారం శాశ్వతం కాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

జలబిందెలతో అభిషేకాలు

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ శివారులో గల కంఠమహేశ్వర స్వామి–శ్రీ సూరమాంబదేవి, వనమైసమ్మ, శ్రీ రేణుక ఎల్లమ్మతల్లికి శుక్రవారం గౌడ కులస్తులు జలబిందెలతో అభిషేకాలు చేశారు. గౌడ కులస్తులు ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ కల్యాణ మహోత్సవంలో గౌడ కులస్తులు కుటుంబసమేతంగా జలబిందెలతో తరలివెళ్లి అభిషేకాలు చేశారు. నేడు బోనాలు సమర్పించిన తర్వాత స్వామివారి కల్యాణం చేయనున్నట్లు గౌడ కులస్తులు తెలిపారు.

శుభకార్యాల్లో పాల్గొన్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించి పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఎర్రుపాలెం, మధిర, బోనకల్, ఖమ్మం, రూరల్ మండలాల్లో జరిగిన వివాహాది శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో ఆయా నియోజకవర్గ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం


నరేష్‌చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: మండలంలోని మద్దిగూడెం గ్రామానికి చెందిన డీఎస్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ దిరిశాల నరేష్‌చౌదరి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం నరేష్‌చౌదరి ఇంట్లో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని దిరిశాలను అభినందించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి మహేందర్‌కుమార్, దమ్మాలపాటి సత్యనారాయణ, ఆరెం రవి, ముక్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

తిరుమలాయపాలెం: ఎస్ఎఫ్ఐ పాలేరు డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన గాదె వరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఖమ్మంలో జరిగిన డివిజన్ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకోగా.. డివిజన్ కార్యదర్శిగా చాపల వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తానని వరుణ్ తెలిపారు.

యువకుడిపై దాడి..

తలకు తీవ్రగాయాలు

నేలకొండపల్లి: ఓ యువకుడిపై ఇరువురు దాడి చేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రామచంద్రాపురానికి చెందిన నవీన్‌పై అదే గ్రామానికి చెందిన వెంకటేష్, ఆయన బంధువు నవీన్ శుక్రవారం ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో నవీన్‌పై దాడి చేయగా ఆయన తలకు తీవ్ర గాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు. కాగా, గ్రామంలో ఇసుక రవాణా విషయమై ఈ వివాదం జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడులో ఈ నెల 7న ఉదయం 10 గంటలకు వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యాన కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సాధనాల వెంకటస్వామినాయుడు, లెనిన్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

8 నుంచి కోటమైసమ్మ జాతర మహోత్సవాలు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల గ్రామంలో శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ జాతర మహోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న మంగళతోరణాలు, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, కుంకుమ పూజ, 9న అమ్మవారికి అభిషేకాలు, పంచామృతాభిషేకం, వాహన పూజలు, 10న మంత్రపుష్పం, కలశం ఉద్వాసన వంటి ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ జాతర మహోత్సవానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా పీర్‌గైబ్‌షావలీ ఉర్సు మహోత్సవం


దర్గాకు చేరుకున్న ఖందిల్

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని శుక్రవారపేటలో అతి పురాతనమైన హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షావలీదర్గాలో ఉర్సు ఉత్సవం ముగిసింది. శుక్రవారం తుమ్మలగడ్డలోని దర్గా సేవకుడు తాజ్‌బాబా ఇంటి నుంచి ప్రత్యేక ప్రార్థనలతో ఉర్సు ఉత్సవాలు మొదలయ్యాయి. గంధం, చాదర్, జెండాలు, పంఖా, బోడా, ఖందిల్‌ను తుమ్మలగడ్డ మసీద్, మోమినాన్ స్కూల్, శుక్రవారపేట సెంటర్, రిక్షా బజార్ సెంటర్, శివాలయం మీదుగా దర్గాకు చేర్చారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా.. మత పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు.

'జన జాతర'ను విజయవంతం చేయండి


ఖమ్మంవన్‌టౌన్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: నేడు హైదరాబాద్ తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరగనున్న తెలంగాణ జన జాతరను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, పార్లమెంటరీ నియోజకవర్గ పీసీసీ ఇన్‌చార్జ్ శివకుమార్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన విలేకరుల సమావేశంలో జావీద్, శివకుమార్ మాట్లాడగా, నేలకొండపల్లిలో రమేష్ మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన పాంచ్ న్యాయ్ (ఐదు గ్యారంటీ)లను ప్రకటించనుందన్నారు. మోదీ నిరంకుశ పాలనకు తుక్కుగూడ సభ నుండే చరమగీతం పాడాలన్నారు. అంతేకాక విపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, కొంటెముక్కల నాగేశ్వరరావు, పాలకుర్తి నాగేశ్వరరావు, బొమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఇఫ్తార్ విందులు


నేలకొండపల్లి: బోదులబండ ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాయల నాగేశ్వరరావు, తదతరులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఖాజామియా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నాచేపల్లిలో అన్నప్రాసన వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, నాయకులు భద్రయ్య, అంజిని, వడ్డె జగన్, మేకల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు కట్టెకోల సుధాకర్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలులో..

తిరుమలాయపాలెం: ముస్లింల ఉపవాస దీక్షల సందర్భంగా శుక్రవారంరాత్రి మండలంలోని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, కిమ్స్ ఆస్పత్రి డెరెక్టర్ చావా శివరామకృష్ణ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోట్ల కిరణ్, రావూరి యాకూబ్‌రావు, దొడ్డ గురవయ్య, చామకూరి శ్రీనివాస్, జాల కిరణ్, వెంకట్, షేక్ సలీం, నజీర్, పాషా, మైబూబ్, రషీద్ పాల్గొన్నారు.

హైదర్‌సాయిపేటలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామంలో తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో ఇంటింటికి లార్వా సర్వే చేయిస్తూ.. జ్వరాలపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్‌లతో పాటు జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారిని, తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి సేకరించిన రక్త నమూనాలను పంపించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందునతాగునీరు ఎక్కువగా తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ నరేష్, నిర్మలా జ్యోతి, ప్రేమలత ఎంహెల్‌హెచ్‌పీ మానస, ఏఎన్ఎం సుగుణ, ఆశాలు దేవి, అనిత, మంగ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి..

- బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిలో వక్తలు
- మాజీ ఉప ప్రధానికి ఘన నివాళులు

మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, వారి చరిత్రను, వారు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అధికారులు, న్యాయవాదులు, రాజకీయ, పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ, భారత రాజ్యాంగ రూపకల్పనలో జగ్జీవన్‌రామ్ కీలకపాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంసహకారనగర్: జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్


ఖమ్మంక్రైం: పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పూలమాల వేస్తున్న సీపీ సునీల్‌దత్


ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్


ఖమ్మంసహకారనగర్: నివాళులర్పిస్తున్న తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్


ఖమ్మం సహకారనగర్: నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు


నేలకొండపల్లి: బైరవునిపల్లిలో..


తిరుమలాయపాలెం: నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు


ఖమ్మంగాంధీచౌక్: ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న మహాసేన ప్రతినిధులు


ఖమ్మం సహకారనగర్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు


ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో టీజీఓస్, టీఎన్జీఓస్ నాయకుల నివాళి